Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 354 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 10 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## తొక్కిసలాట కేసులో మరో మలుపు.. కర్ణాటక హైకోర్టుకు ఆర్‌సీబీ




**బెంగళూరు:** చిన్నస్వామి స్టేడియం వెలుపల జూన్ 4న జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందిన ఘటనపై ఐపీఎల్ టీమ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఓనర్ రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ లిమిటెడ్, ఈవెంట్ ఆర్గనైజర్ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లు కర్ణాటక హైకోర్టును సోమవారం నాడు ఆశ్రయించాయి. తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కోరాయి.

**గేట్లు తెరవడంలో ఆలస్యం**

తొక్కిసలాటకు దారితీసిన క్రౌడ్ మేనేజిమెంట్‌లో తమ పాత్ర ఏమీ లేదని ఆర్‌సీఎస్ఎల్ తమ పిటిషన్‌లో పేర్కొంది. విక్టరీ సెలబ్రేషన్స్‌కు పరిమితంగానే పాస్‌లు ఉన్నాయని, ఉచిత రిజిస్ట్రేషన్ పాసుల కోసం ముందుగానే రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందని సోషల్ మీడియా ద్వారా తాము చాలా స్పష్టమైన ప్రకటనలు చేసినట్టు తెలిపింది. స్టేడియం గేట్లు తెరవడంలో ఆలస్యం జరిగిందని కూడా ఆరోపించింది. షెడ్యూల్ ప్రకారం 1.45 గంటలకు గేట్లు తెరవాల్సి ఉండగా, 3.00 గంటలకు తెరిచారని, దీంతో ఒక్కసారిగా జనం అక్కడకు చేరుకున్నారని తెలిపింది.

**పోలీసుల వైఫల్యమే**

డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ మరో పిటిషన్‌లో పోలీసులు, రాష్ట్ర అధికారుల వైఫల్యమే తొక్కిసలాటకు కారణమని ఆరోపించింది. 3 లక్షల మందికి పైగా ప్రజలు వచ్చినప్పుడు వారిని కంట్రోల్ చేయడంలో పోలీసులు, రాష్ట్ర అధికారులు విఫలమయ్యారని పేర్కొంది. తగినన్ని పోలీసు బలగాలను మోహరించకపోవడం, లాఠీచార్జి జరపడంతో ఈవెంట్‌కు హాజరయ్యేందుకు వచ్చిన వారు ఆందోళనకు గురయ్యారని, దీంతో స్టేడియం వెలుపల రోడ్లు, ఫుట్‌పాత్‌లపై తొక్కిసలాట జరిగిందని వివరించింది. ఎక్కువ మంది పోలీసులను విధానసభ వద్దే మోహరించి, స్టేడియం వద్ద తగినంత సిబ్బంది లేకుండా చేసినట్టు కూడా ఆరోపించింది. క్రమశిక్షణా చర్య నుంచి తప్పించుకునేందుకు కుబ్బన్ పార్క్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుమోటో ఫిర్యాదు చేసినట్టు డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ ఆరోపించింది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా హడావిడిగా, పక్షపాత వైఖరితో తమపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు తెలిపింది. జూన్ 6వ తేదీ ఉదయం ఎలాంటి విచారణ లేకుండానే కంపెనీకి చెందిన ఇద్దరు అధికారులను అరెస్టు చేసినట్టు పేర్కొంది. నేరుగా తమ తప్పిదం ఉన్నట్టు ఎలాంటి సాక్ష్యాలు లేనందున తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని ఆర్‌సీఎల్, డీఎన్ఏలు తమ పిటిషన్లలో హైకోర్టును కోరాయి.

## ఏపీలో ఉత్తమ విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డ్ ప్రదానం

**విజయనగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 4,168 మంది విద్యార్థులను షైనింగ్ స్టార్స్ అవార్డుల పేరుతో సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లో ఉత్తమ అత్యుత్తమ కనబరిచిన విద్యార్థులకు ఈరోజు (సోమవారం) ఈ అవార్డులతో సత్కరించారు. విజయనగరం జిల్లాలో షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం కార్యక్రమంలో హోం మంత్రి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం హోంమంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని కొనియాడారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ షైనింగ్ స్టార్స్ పేరుతో విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేయడం చాలా సంతోషమన్నారు. విద్య.. విలువలు నేర్పుతుందన్నారు. విద్య విలువలు నేర్పుతుంది అనే పదానికి నిదర్శనం అశోక్ గజపతిరాజు అని అన్నారు. పిల్లల కోసం తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేస్తారని.. పిల్లలు విజయం వెనుక తల్లిదండ్రుల కృషి ఎంతో ఉంటుందన్నారు. పిల్లలకు చదువే భవిష్యత్తు, చదువే పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. ప్రతీ విద్యార్థి లక్ష్యం దిశగా ముందుకు వెళ్ళాలని తెలిపారు. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పిల్లలకు నడవడిక చాలా ముఖ్యమని.. పిల్లలు జాగ్రత్తగా ఉండాలని హోంమంత్రి అని సూచించారు.

**విజయవాడలో షైనింగ్ సార్ట్ అవార్డ్స్**

అటు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జిల్లా స్థాయి ఉత్తమ విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డ్స్ ప్రదానం చేశారు. షైనింగ్ స్టార్స్ అవార్డ్స్‌కు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, ఎమ్మెల్యే బోండా ఉమా, కలెక్టర్ లక్ష్మీశ, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ ముఖ్య అతిథులుగా



విచ్చేశారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్‌లో ఉత్తీర్ణ మార్పులు సంపాదించిన విద్యార్థులకు అవార్డ్స్ అందజేశారు. టెన్త్‌లో ఉత్తీర్ణత మార్కులు వచ్చిన 131 మందికి, ఇంటర్‌లో ఉత్తీర్ణత పొందిన 43 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డ్సును ప్రదానం చేశారు.

**విశాఖలో 121 మందికి అవార్డుల ప్రదానం**

విశాఖలో షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 121 మంది విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. పాఠశాల విద్యా శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ.. విద్యార్థులు విజయాన్ని కాదు ఫెయిల్యూర్స్ కూడా తెలుసుకోవాలని.. అప్పుడు మనల్ని మనం సరి చేసుకోగలమన్నారు. ఏ విద్యార్థి తనని తాను తక్కువగా చూసుకోకూడదని.. అది వారి ఎదుగుదలకు సమస్యగా మారకూడదని ఎంపీ అన్నారు. నేటి విద్యార్థులే దేశానికే రాష్ట్రానికి అవసరమైన మానవ వనరులు అని మంత్రి బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఈ కార్యక్రమానికి విప్ గణబాబు, గండి బాబ్జీ, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ హాజరయ్యారు.

## నిరసన తెలుపుతున్న రాజధాని ప్రజలపై నోరు పారేసుకున్న సజ్జల




**అమరావతి, (రాజధాని వార్తలు):** రాజధాని అమరావతి మహిళలపై వైసీపీకి చెందిన సాక్షి టీవీ చర్చ కార్యక్రమంలో జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. అలాంటి వేళ వైసీపీ నేతలు తమ తీరు మార్చుకోవడం లేదు. సాక్షిలో చేసిన ఆ వ్యాఖ్యలను పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి సమర్థించారు. అలాగే రాజధాని మహిళలపై అక్కసు వెళ్లగక్కుతూ తీవ్ర పదజాలంతో దూషించారు. సోమవారం ఆయన అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నిరసనలు చేస్తున్న మహిళలను పిశాచాలు, రాక్షసులు అంటూ సజ్జల వ్యాఖ్యానించారు. ఆవేదనతో నిరసనలు చేస్తున్న రాజధాని మహిళలను సంకర తెగ అంటూ తీవ్ర పదజాలంతో దూషించారు. నిరసనలు చేసిన తెగ అర్గనైజ్డ్‌గా ఉన్న సంకర తెగ అంటూ సజ్జల రామకృష్ణారెడ్డి అనడం సంచలనంగా మారింది. సాక్షి మీడియాలో ఇటీవల చర్చ కార్యక్రమంలో జర్నలిస్ట్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. రాజధాని అమరావతి వేశ్యల రాజధాని అంటూ కామెంట్ చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ వ్యాఖ్యలను ఖండించలేదు. అంతేకాకుండా.. ఈ వ్యాఖ్యలను ఆయన చాలా సాదాసీదాగా తీసుకున్నారు. అయితే ఈ చర్చ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలపై అమరావతి ప్రాంత మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి మీడియా యాజమాన్యం క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేస్తూ మహిళలు ఆందోళనకు దిగారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుతోపాటు సాక్షి మీడియాపై కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు కొమ్మినేనిని పోలీసులు అరెస్టు చేశారు. అలాంటి వేళ ఈ వ్యవహారంపై అమరావతిలో సజ్జల రామకృష్ణారెడ్డి స్పందిస్తూ.. పైవిధంగా వ్యాఖ్యలు చేశారు. ఇక సజ్జల వ్యాఖ్యలపై సైతం ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్త మవుతోంది.

## రెండు నెలల్లో సేవలన్నీ వాట్సప్‌లో : చంద్రబాబు




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల యాక్షన్ ప్లాన్ కార్యాలయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు (సోమవారం) వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రపంచంలో యువత ఎక్కువగా ఉన్న దేశం ఇండియా అని అన్నారు. బ్రాండింగ్ అనేది ఇప్పుడు చాలా ముఖ్యమని తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో స్వచ్ఛాంధ్రను అమలు చేస్తున్నామని తెలిపారు. డీప్ టెక్‌తో టెక్నలజీ బాగా పెరిగిందన్నారు. వాట్సప్ గవర్నెన్స్‌తో ఆన్‌లైన్ సేవలు అందుతున్నాయని తెలిపారు. రెండు నెలల్లో అన్ని సర్వీస్‌లు వాట్సప్‌లో ఉంటాయని వెల్లడించారు. రాబోయే రోజుల్లో డేటా నాలెడ్జి, టూల్స్ అన్ని రెడీగా ఉంటాయని అన్నారు. టెక్నాలజీ అనేదీ ఫ్యాషన్ కాదు.. గేమ్ ఛేంజర్ అని తెలిపారు. పేదరికం లేని ఏపీని తయారు చేస్తామని.. అందుకే పీ4 కార్యక్రమం తీసుకు వచ్చామని అన్నారు. ఆదాయం పెరగాలని ఆరోగ్యం, ఆనందం ఉండాలని ఆకాంక్షించారు. 26 జిల్లాల్లో యాక్షన్ ప్లాన్ విజన్ డాక్యుమెంట్ తయారైనట్లు తెలిపారు. 26 జిల్లాల్లో రోడ్ మ్యాప్ మండలాల వారీగా కూడా యాక్షన్ ప్లాన్ సిద్ధమైనట్లు చెప్పారు. కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితి ఒక్కోలా ఉంటుందన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో వ్యవసాయం తక్కువ, ఉద్యానవన పంటలు ఎక్కువ ఉంటాయన్నారు. మరొకొన్ని జిల్లాల్లో ఆక్వా, డైరీ ఇలా అందుబాటులో ఉన్న వాటిని ఉపయోగించుకోవాలని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతీ నియోజకవర్గంలో అనుకూలమైన సర్వీస్ సెక్టార్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హాస్పిటల్, టూరిజం ఇలా అన్ని రంగాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. మరోవైపు జాతీయ రహదారులు, రాష్ట్రంలో రోడ్లపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో శరవేగంగా రహదారుల నిర్మాణం జరగాలన్నారు. జూలై నెలాఖరుకు ఆటంకాలు తొలిగించాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది 1,040 కి.మీ జాతీయ రహదారుల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న, త్వరలో నిర్మించ తలపెట్టిన అన్ని రాష్ట్ర, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, అటవీ, వన్యప్రాణి క్లియరెన్స్ సమస్యలు జూలై నెలాఖరుకు పరిష్కరించాలన్నారు. ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా రాష్ట్రంలో రహదారుల నిర్మాణం వేగవంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. వివిధ రహదారి ప్రాజెక్టుల పురోగతిని ఈ సందర్భంగా సీఎం పరిశీలించారు. నిర్ణీత కాలవ్యవధికి మించి ఆలస్యమైన ప్రాజెక్టుల కాంట్రాక్ట్ సంస్థలపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ఏ రహదారి నిర్మాణమూ ఆలస్యం కాకూడదని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్ఏఐ, ఎంఓఆర్టీహెచ్ కింద రూ.11,325 కోట్లతో 770 కి.మీ రహదారులు గత ఆర్థిక సంవత్సరంలో నిర్మాణం పూర్తి చేసినట్లు ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. రూ.20,067 కోట్ల విలువైన 1,040 కి.మీ. రహదారి పనులు పూర్తి కావాలని సూచించారు. 1,307 కి.మీ పొడవైన అత్యంత రద్దీ కలిగిన 18 రహదారుల డీపీఆర్ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. మిగిలిన 8,893 కి.మీ.పొడవైన 242 రహదారుల ఫ్రీ విజబిలిటీ అధ్యయనాన్ని రెండు విడతల్లో చేపట్టాలన్నారు. సీఎం సూచనల మేరకు అదనంగా యలమంచిలి – గాజువాక, గాజులమండ్యం – శ్రీసిటీ రహదారుల్ని కూడా పీపీపీ విధానంలో అభివృద్ధి జరుగనుంది.

## రాజధాని అమరావతిపై బురద జల్లుతున్నారు.. జగన్‌పై రఘురామ ఫైర్

**కృష్ణా, (రాజధాని వార్తలు):** ఏపీ రాజధాని అమరావతిపై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బురదజల్లుతున్నారని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై ముందు నుంచే విషప్రచారం చేశారని ధ్వజమెత్తారు. గతంలో మాట్లాడిన దానికంటే ఇప్పుడు ఇంకా ఎక్కువగా అమరావతిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు రఘురామకృష్ణంరాజు. వైసీపీ నేతలు వాళ్ల ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే తరిమికొడతారని రఘురామకృష్ణంరాజు హెచ్చరించారు. ఇవాళ(సోమవారం) హైదరాబాద్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కి రఘురామకృష్ణంరాజు వచ్చారు. ఈ సమయంలో రఘురామకి అమరావతి మహిళలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో రఘు రామ మాట్లాడారు. గతంలో ప్రెస్ కౌన్సిల్ చైర్మన్‌గా కొమ్మినేని శ్రీనివాసరావు పనిచేశారని తెలిపారు రఘురామకృష్ణంరాజు. జర్నలిస్టులకు విధివిధానాలు నేర్పాల్సిన వ్యక్తి ఇలా జర్నలిజం విలువలు మర్చిపోయి మాట్లాడు తారా అని రఘురామకృష్ణంరాజు మండిపడ్డారు. జర్నలిస్ట్ కృష్ణంరాజు నోటికి వచ్చినట్లుగా మాట్లాడుతుంటే కొమ్మినేని వెక్కిలి నవ్వులు నవ్వుతున్నారని ధ్వజమెత్తారు. కృష్ణంరాజు వ్యాఖ్యలకు అలా సపోర్ట్ చేయడమనేది తీవ్రమైన చర్య అని దుయ్యబట్టారు. రెండు రోజుల నుంచి చూస్తున్నామని.. మహిళా లోకం ఉవ్వెత్తున తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నారని



చెప్పుకొచ్చారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకి లేఖ రాశామని గుర్తుచేశారు. ఈ విషయంపై డీజీపీకి తగిన చర్యలు తీసుకోవాలని కోరామని అన్నారు రఘురామకృష్ణంరాజు. తనకైతే విశ్వాసం ఉందని.. రాబోయే 24 గంటల్లో వాళ్లని అరెస్ట్ చేస్తారని రఘురామకృష్ణంరాజు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ విషయంపై సీరియస్‌గా ఉన్నారని అన్నారు. మహిళల గురించి అలా ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిని దేవతల రాజధాని అన్నారని.. ఈ విషయాన్ని జగన్ జీర్ణించుకోలేక పోతున్నారని మండిపడ్డారు. అమరావతిపై ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సాక్షిలో పని చేస్తున్న కొమ్మినేనిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని రఘురామకృష్ణంరాజు వార్నింగ్ ఇచ్చారు.

## భార్య అఫైర్ వల్లే భర్త చనిపోయాడా.. పోలీసులు ఏం చెబుతున్నారంటే



షిల్లాంగ్: హనీమూన్ కోసం మేఘాలయ వెళ్లి హత్యకు గురైన వ్యక్తి కేసులో పోలీసులు అతడి భార్యనే అనుమానిస్తున్నారు. ఆమెకు ఉన్న అఫైర్ వల్లే భర్త ప్రాణాలు కోల్పోయాడని చెబుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీకి మే నెల 11వ తేదీన సోనమ్‌తో వివాహం జరిగింది. 20వ తేదీన వారిద్దరూ హనీమూన్ కోసం మేఘాలయకు వెళ్లారు. ఆ తర్వాత కనిపించకుండా పోయారు. 11 రోజుల తర్వాత రఘువంశీ మృతదేహం ఓ జలపాతం దగ్గర లభ్యమైంది. రఘువంశీ మృతదేహంపై కత్తిపోట్లు ఉన్నాయి. దీంతో అతడు హత్యకు గురైనట్టు స్పష్టమైంది. అయితే గాజీపూర్ నుంచి కుటుంబసభ్యులకు ఫోన్ చేసిన సోనమ్ విషయం చెప్పింది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. సోనమ్‌కు రాజ్ కుశ్వాహ్ అనే బాయ్ ఫ్రెండ్ ఉన్నాడని, అతడి సహకారంతోనే భర్తను సోనమ్ హత్య చేయించిందని పోలీసులు అనుమానిస్తున్నారు. కాంట్రాక్ట్ కిల్లర్లకు సోనమ్ సుపారీ ఇచ్చి తన భర్తను చంపించిందని పోలీసులు చెబుతున్నారు. ఈ హత్యకు ఆమె బాయ్‌ఫ్రెండ్ రాజ్ కుశ్వాహ్ సహకరించాడని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలినట్టు సమాచారం. ఈ హత్యతో సంబంధం ఉన్న విక్కీ ఠాకూర్, ఆకాశ్, ఆనంద్ అనే వ్యక్తులనూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఈ ముగ్గురు తాము సుఫారీ తీసుకుని రఘువంశీని హత్య చేసినట్టు అంగీకరించారని సమాచా రం. ఈ హత్యలో సోనమ్, రాజ్ కుశ్వాహ్ పేర్లను వారు బయట పెట్టినట్టు తెలుస్తోంది. కాగా, తాను నిందితురాలిని కానని, తనను ఎవరో కిడ్నాప్ చేశారని సోనమ్ చెబుతున్నట్టు పోలీసులు తెలిపారు. మరోవైపు సోనమ్ రఘువంశీ తండ్రి దేవి సింగ్ మాత్రం తన కుమార్తె అమాయకురాలని చెప్పుకొచ్చారు. ఆమె తన భర్తను చంపి ఉండదని అన్నారు. తన కుమార్తె విషయంలో మేఘాలయ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని సోనమ్ తండ్రి ఆరోపించారు.

# కాకినాడ మెయిన్ రోడ్డులో 7 వేల మందితో యోగ కార్యక్రమం

## - ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగ ఒక భాగం కావాలి : జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి










**కాకినాడ, (రాజధాని వార్తలు):** వివిధ వృత్తులలో పని చేస్తున్న ప్రతి ఒక్కరు నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించ వచ్చని జిల్లా కలెక్టర్ షన్మోహన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన ప్రత్యేక యోగా కార్యక్రమం కాకినాడ మెయిన్ రోడ్డు టూ టౌన్ పోలీస్ నుంచి ఎల్ఐసీ బిల్డింగ్ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ యోగ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, కాకినాడ స్మార్ట్ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన, అడిషనల్ ఎస్పీ మానిష్ పాటిల్ దేవరాజ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట్రావు, పాడా పీడీ చైత్ర వర్షిణి, కాకినాడ ఆర్డీవోఎస్.మల్లిబాబులతో పాటు సుమారు 7 వేల మంది ఉపాధ్యాయులు హాజరై యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో గత నెల మే 21 నుంచి ఈ నెల 21 వరకు నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం పని చేస్తున్నమన్నారు. జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి ఇప్పటివరకు 8.5 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు ప్రకారం జిల్లాలో శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల ఉపాధ్యాయులతో భారీ స్థాయిలో యోగా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 7 వేల మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. ఈ యోగ సాధన కేవలం అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు వరకు మాత్రమే పరిమితం కాకుండా నిత్య జీవితాల్లో యోగాను ఒక భాగం చేసుకోవాలన్నారు. యోగాను రోజు సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతోపాటు వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న వారు మరింత సమర్థతతో విధులు నిర్వర్తించేందుకు యోగ దోహద పడుతుందని ఆయన తెలిపారు. జిల్లా అంతటా ఈ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. జూన్ 21న జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో యోగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసుకుని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ రోజు జరిగిన యోగా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులను ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జిల్లా అధికార యంత్రాంగానికి పూర్తి సహకారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కోరారు. ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖరం మాట్లాడుతూ..మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంల్లో భాగస్వామ్యం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్క పౌరుడికి ఆరోగ్యం చాలా అవసరమని, నిత్యం వివిధ రకాల మందులు వాడుతూ ఆరోగ్యం పాడు చేసుకోకుండా యోగ సాధన చేయడం ద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు. గౌరవ దేశ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో దృఢ సంకల్పంతో యోగ కార్యక్రమాలు నిర్వహించుకోవడం శుభ పరిణామని ఆయన తెలిపారు. యోగ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లాలో అత్యంత ప్రతిష్టంగా నిర్వహిస్తున్న జిల్లా అధికార యంత్రాంగాన్ని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర మంతట పండుగ వాతావరణంలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గౌరవ రాష్ట్ర ముఖ్య మంత్రి పరిశుభ్రత, పచ్చదనం వంటి కార్యక్రమా లతో పాటు అందరి ఆరోగ్యంపైన కూడా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తు యోగాంధ్ర కార్యక్రమం కార్యక్రమాన్ని ప్రణాళిక ప్రకారం నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు. ప్రాచీన కాలం నుంచి భారత దేశంలో యోగాకు ప్రత్యేక స్థానం ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ గుర్తు చేశారు. మన పూర్వీకులు యోగాను సాధన చేయడం ద్వారానే ప్రశాంతమైన జీవనాన్ని గడిపారన్నారు. వారందరినీ స్ఫూర్తిగా తీసుకుని మనం కూడా యోగా సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె తెలిపారు. కాకినాడ స్మార్ట్ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగ డే సందర్భంగా మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా గురించి గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలనేది గౌరవ ముఖ్యమంత్రి ఉద్దేశమని ఆయన తెలిపారు. రోజువారి దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరు మానసిక ఒత్తిడికి గురి అవుతున్నారని దాని నుంచి బయటపడడానికి యోగ తప్పనిసరి అన్నారు. రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 40 సంవత్సరాలుగా చేస్తున్న యోగా వల్ల 80 సంవత్సరాలు అయిన కూడా ఇంకా ఎంతో ఎనర్జిటిక్‌గా పనిచేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షకులు రామానంద అందరిచేత ప్రజలు, అధికారులు, యువత మహిళలతో ఆసనాలు సాధన చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆయుష్ వైద్య అధికారి అలీ ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ అందజేత




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఆటో యూనియన్ల డ్రైవర్లందరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించడం, యూనిఫాం ధరించడం, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండటం, తమ నోటీసులో ఏవైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు ఉంటే సంబంధిత పోలీసు స్టేషన్లకు తెలియజేయా లని పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు, సీఐ కృష్ణ భగవాన్, క్రైమ్ సీఐ అంకబాబులు అన్నారు. సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ పంపిణీ కార్యక్రమం రైల్వే స్టేషన్ ఆవరణలో చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల అంతా ట్రాఫిక్ నిబంధనలో కచ్చితంగా పాటించాలి అన్నారు. ప్రయాణికుల సామాగ్రి పట్ల నిబద్ధత కలిగి ఉండి, ప్రమాదాలకు వివాదాలకు తావు లేకుండా జీవనోపాధిని సాగించాలన్నారు. అలాగే రద్దీగా ఉన్న సెంటర్లలో ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా పూర్తి సహకారం అందించాలన్నారు. ఇంకా పొలంసాలపై ఆటో డ్రైవర్లతో ట్రాఫిక్ పోలీసులు పలు సూచనలు చేశారు. అనంతరం పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, కాకినాడ, వేట్లపాలెం, ద్వారపూడి, ఉండూరు స్టాండ్‌లకు చెందిన సుమారు 100 మంది ఆటో డ్రైవర్లకు యూనిఫాం దుస్తులను అందజేశారు. ఈ కార్యక్ర మంలో రఘు రెసిడెన్సీ అధినేత రఘు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సన్యాసిరావు, శ్రీను, ఈశ్వరరావు, సత్యనారాయణ, శ్రీను, పాండురంగ, శ్రీను, సరోజినీ, ఆయా ఆటో స్టాండ్‌ల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# సెంటర్లో మద్యం షాపు.... రహదారిపై చిందులతో మద్యం బాబులు

## - పగలు, రాత్రి తేడా లేకుండా గుంపులు గుంపులుగా మద్యం బాబుల చిందులతో వాహన రాకపోకలకు, ప్రజలకు ఇబ్బందులు - కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్న స్థానిక ప్రజలు





**అల్లవరం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నం సెంటర్‌లో మద్యం దుకాణం కారణంగా వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బెండమూర్లంక, కోమరగిరిపట్నం మూడు రోడ్ల జంక్షన్ వద్ద కొమరగిరిపట్నం వైపు వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని మద్యం షాపు ఏర్పాటు చేశారు. నిత్యం రద్దీగా ఉండే సెంటర్ కావడం అదనంగా మద్యం షాపు ఏర్పాటు చేయటంతో పెద్ద సంఖ్యలో మద్యం బాబులు సెంటర్‌కు చేరుకోవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గుంపులు గుంపులుగా రహదారిపైనే మద్యం బాబుల చిందులతో అటుగా వెళ్లాలంటే మహిళలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. మెయిన్ సెంటర్‌లో రోడ్డుపక్కనే నిభందనలకు విరుద్ధంగా మద్యం షాపు ఏర్పాటు చేయడం వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగేలా అడ్డుగా మందు బాబుల వాహనాలను పార్క్ చేయటంతో సామా న్యుల సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఉంచుతున్నా మద్యం షాపు నిర్వాహకులు మాత్రం పట్టించుకోవటం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని విధాలుగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ అటువైపుగా వెళ్లే పోలీసులు మాత్రం కనీసం కన్నెత్తి చూడడం లేదంటూ గ్రామస్తుల అసహనం వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకు ఫిర్యాదు చేస్తామని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# యశ్వంత్ విద్యాభ్యాసానికి పోలీసుల సహాయం




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలోని సత్తిరెడ్డి పేటకు చెందిన కర్రి యశ్వంత్ అనే బాలుడి విద్యాబ్యాసానికి పెద్దా పురంపోలీసులు అండగా నిలిచారు. యశ్వంత్ తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో నానమ్మ అప్పలనరసమ్మ దగ్గరే ఉంటూ ట్రినిటీ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. అయితే నిరుపేదైన యశ్వంత్ చదువుకు డబ్బుల అవసరాన్ని తెలుసుకున్న పెద్దాపురం జనసైనికుడు వంగలపూడి సతీష్ విషయాన్ని పెద్దాపురం పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో గతంలో అప్పటి డీఎస్పీగా ఉన్న లతకుమారి ఒక విద్యా సంవత్సరానికి అవసరమైన ఖర్చులను అందజేశారు. కాగా ఈ విద్యా సంవత్సరానికి గానూ పెద్దాపురం ఎస్ఐ మౌనిక విద్యాభ్యా సానికి అవసరమైన ఖర్చులకు ఆర్థిక సహాయాన్ని చేశారు. అవసరంలో ఉన్న విద్యార్థి చదువుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించిన పెద్దాపురం పోలీసుల ఉదారత పట్ల పట్టణ ప్రజలు పోలీసులను అభినందిస్తున్నారు. ఇలాంటి సేవాకార్యక్రమాలు పోలీసులు చేయడం వలన పోలీసుల పట్ల ప్రజల్లో మరింత గౌరవం పెరుగుతోందని పలువురు చెబుతున్నారు.

# కటకంశెట్టి బాబీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు

**కరప, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని, తెలుగుదేశం పార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి) ఆధ్వర్యంలో నియోజకవర్గవ్యాప్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించబడుతున్నాయి. ఈ శిబిరాల్లో భాగంగా కరప మండల పరిధిలోని వేములవాడ గ్రామంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 200 మంది ప్రజలు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 50 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. అవసరమైన వారికి త్వరలోనే ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కిరణ్ కంటి ఆసుపత్రి సాంకేతిక సహకారం అందిస్తోంది. ఈ సందర్భంగా కరప నీటి సంఘం డిసి చైర్మన్ పుణ్యమంతుల గంగ సత్యనారాయణ (పి.జి) మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యాన్ని ప్రాధాన్యంగా తీసుకుంటూ కటకంశెట్టి బాబి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి ఒక్కరినీ కుటుంబ సభ్యుల్లా భావిస్తూ అండగా నిలుస్తున్నారు. ఇటువంటి నాయకులు నియోజకవర్గానికి



అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో కరప మండల టీడీపీ అధ్యక్షుడు దేవు వెంకన్న, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట ప్రకాష్ గౌడ్, కరప మాజీ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్క నాగేశ్వరరావు, మీసాల రాంబాబు, అప్పనపల్లి వెంకట నారాయణ, వాసంశెట్టి నారాయుడు, వాసంశెట్టి త్రిమూర్తులు, పింకీ ప్రసాద్, నక్క వీరన్న, ఎర్ర నీటి సుబ్రహ్మణ్యం, గుబ్బల భాస్కరరావు, చోడిశెట్టి కృష్ణ, పెంటపాటి చక్రం, మార్కం దేయులు, సవరపు సత్తిబాబు, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ జనసేనలో చేరిక




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, వైసీపీ నాయకులు పెదిరెడ్ల రామకృష్ణ శనివారం జనసేన పార్టీలో చేరారు. పెద్దాపురం నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో పెద్దాపురం పట్నం సీనియర్ జనసేన నాయకులు ఆధ్వర్యంలో మాజీ వైసీపీ కౌన్సిలర్ రామకృష్ణ జనసేన పార్టీలో చేరారు. పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) చేతుల మీదుగా పార్టీ కండువా కప్పి ఆయన రామకృష్ణను పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, పవన్ కళ్యాణ్ పరిపాలన నచ్చి జనసేన పార్టీలోకి రావడం చాలా సంతోషమన్నారు. కష్టపడే ప్రతి వ్యక్తిని క్రియాశీలకంగా తన రాజకీయానికి భవిష్యత్తుకు నాంది వేసే పార్టీ జనసేన పార్టీ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం పట్టణ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు, వార్డు కౌన్సిలర్ ఒబిలిశెట్టి గున్ని గణేష్, జనసేన పార్టీ యూత్ అధ్యక్షులు తమన లక్ష్మీ దివాకర్, జనసేన నాయకులు కందుల వెంకటచలం, గాదంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# త్రివిక్రమ్ మిగిలిన వారితో పోటీ పడేదెప్పుడు?



రైటర్‌గా కెరీర్‌ను మొదలుపెట్టిన త్రివిక్రమ్, ఆ తర్వాత డైరెక్టర్‌గా మారి పలు హిట్ సినిమాలు తీసి స్టార్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నాడు. టాలీవుడ్ స్టార్ హీరోలతో కలిసి ఎన్నో మెమొరబుల్ సినిమాలు తీసిన ఆయన సిట్యుయేషన్ ప్రస్తుతం అనుకున్నంత బాలేదు. ఒకప్పుడు త్రివిక్రమ్ సినిమా అంటే ఎగబడి డేట్స్ ఇచ్చే స్టార్లు ఇప్పుడు ఆయనతో సినిమా అంటే లేట్ చేస్తున్నారు. దానికి కారణం ఆయన ఫేమ్. అల వైకుంఠపురములో తర్వాత త్రివిక్రమ్ ఎన్టీఆర్‌తో ఓ సినిమా చేయాల్సింది. కానీ అది క్యాన్సిల్ అయింది. ఆ తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబుతో ఓ కథను లాక్ చేసి, సినిమా చేద్దామనుకున్నారు. కానీ అది సెట్స్ పైకి వెళ్లాక పలు మార్లు కథ మారి గుంటూరు కారంగా మారింది. గుంటూరు కారం సినిమా మహేష్ ఫ్యాన్స్‌కు నచ్చినప్పటికీ మిగిలిన వారిని మాత్రం మెప్పించలేకపోయింది. ఇంకా చెప్పాలంటే అసలు గుంటూరు కారం సినిమా త్రివిక్రమ్ తీసిందేనా అని డౌట్ కూడా వస్తుంది. ఒకప్పుడు త్రివిక్రమ్ పేరు చెప్పగానే ఫ్యామిలీ సినిమాలు, ప్రాసలు గుర్తొచ్చేవి కానీ ఇప్పుడవి తగ్గాయి. అందుకే గుంటూరు కారం సినిమా తర్వాత త్రివిక్రమ్ నెక్ట్స్ ప్రాజెక్టుని సెట్ చేయడానికి ఇంత కాలం పడుతుంది. వాస్తవానికి బన్నీతో త్రివిక్రమ్ సినిమాను లాక్ చేసుకుని అనౌన్స్ కూడా చేశారు. గుంటూరు కారం తర్వాత నుంచి మొన్నటివరకు త్రివిక్రమ్ ఆ ప్రాజెక్టుపైనే వర్క్ చేశాడు. భారీ బడ్జెట్ తో మైథలాజికల్ స్టోరీతో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను తీయనున్నామని నిర్మాత నాగ వంశీ కూడా చెప్పాడు. కానీ ఏమైందో ఏమో సడెన్‌గా అల్లు అర్జున్ అట్లీతో ప్రాజెక్టును మొదలుపెట్టి అందరికీ షాకిచ్చాడు. దీంతో త్రివిక్రమ్ ఇప్పుడు మరోసారి ఖాళీ అయ్యాడు. వెంకటేష్‌తో ప్రాజెక్టు అంటున్నారు కానీ అది పట్టాలెక్కే వరకు నమ్మలేం. ఒక వేళ పట్టాలెక్కి సినిమా చేసినా అది టాలీవుడ్‌కు మాత్రమే పరిమితమవుతుంది. నిన్న కాక మొన్న వచ్చిన డైరెక్టర్లు కూడా పాన్ ఇండియా సినిమాలు చేసి సత్తా చాటుతుంటే త్రివిక్రమ్ మాత్రం ఇంకా టాలీవుడ్‌కే పరిమితమవడం ఆయన ఫ్యాన్స్‌ను కలవరపెడుతుంది. మరి వీటన్నింటినీ అధిగమించి త్రివిక్రమ్ తన నెక్ట్స్ ప్రాజెక్టును ఎవరితో చేస్తాడో చూడాలి.

# ఏషియన్ వింగ్‌లోకి మాస్ మహారాజా రవితేజ



ఏషియన్ సినిమాస్ పేరుతో సునీల్ నారంగ్ గ్రూప్ మల్టీప్లెక్స్ థియేటర్ల వింగ్‌ని ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ మల్టీప్లెక్స్ వింగ్‌లోకి స్టార్ హీరోలు అల్లు అర్జున్, సూపర్ స్టార్ మహేష్ బాబు, రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ ఎంటరయ్యారు. ఏషియన్ మల్టీప్లెక్స్ థియేటర్స్ చైన్‌లోకి అడుగు పెట్టిన విషయం తెలిసిందే. సూపర్ స్టార్ మహేష్ బాబు గచ్చిబౌలిలోని ఏఎంబీ మాల్‌ని ప్రారంభించడం తెలిసిందే. ఇదే తరహాలో విజయ్ దేవరకొండ మహబూబ్ నగర్‌లో ఇదే ఏషియన్ థియేటర్స్ అండర్‌లోనే మల్టీప్లెక్స్ థియేటర్‌ని ప్రారంభించడం, అమీర్ పేట్ సత్యం థియేటర్ ప్లేస్‌లో అల్లు అర్జున్ అల్లు అర్జున్ ఏషియన్ థియేటర్‌ని స్టార్ట్ చేయడం తెలిసిందే. ఇప్పుడు ఇదే గ్రూప్‌లోకి మాస్ మహారాజా రవితేజ ఎంటరవుతున్నారు. ఆయన కూడా మల్టీప్లెక్స్ థియేటర్‌ని ప్రారంభించబోతున్నారు. ఏఆర్టీ సినిమాస్ పేరుతో రవితేజ మల్టీప్లెక్స్ థియేటర్‌ని ప్రారంభిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాల్ని తాజాగా ఏషియన్ గ్రూప్స్ అధినేత సునీల్ నారంగా వెల్లడించారు. సకల హంగులతో రూపొందించిన ఏషియన్ రవితేజ థియేటర్‌ని వనస్థలిపురంలో ప్రారంభించబోతున్నారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీతో ప్రీమియం మల్టీప్లెక్స్ ఏషియన్ గ్రూప్ విస్తరణలో ఓ మైలురాయిగా చెబుతున్నారు. ఇందులో ఆరు ఆల్ట్రా మోడ్రన్ స్క్రీన్స్ ఉంటాయి. ఒక్కో స్క్రీన్‌ని అసాధారణమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్‌ని ప్రేక్షకుడిని అందించే విధంగా అత్యాధునిక ఆడియో – విజువల్ టెక్నాలజీతో రూపొందించారట.

ఈ ఆరు స్క్రీన్‌లలో ప్రత్యేకంగా 57 అడుగుల వెడల్పుగల భారీ EPIQ ఓ స్క్రీన్‌ని ఏర్పాటు చేస్తున్నారు. ఇది సినీ లవర్స్‌కు సరికొత్త అనుభూతిని అందిస్తుందట. ఈ విషయాల్ని వెల్లడిస్తూ సునీల్ నారంగ్ అసలు విషయం బయట పెట్టారు. ఈ మల్టీప్లెక్స్ థియేటర్‌ని జూలైలో ప్రారంభించబో తున్నామని స్పష్టం చేశారు. రవితేజ టేస్టుకు తగ్గట్టుగా ఈ థియేటర్‌ని ప్రపంచ స్థాయి ప్రమాణాలు, సౌకర్యాలతో నిర్మించారట. సినిమాని సరికొత్త డైమెన్షన్‌లో ఆస్వాదించాల నుకునే వారికి ఏఆర్టీ సినిమాస్ సరికొత్త డెస్టినేషన్‌గా నిలవనుందని ఇన్ సైడ్ టాక్.


# బన్నీ ట్రిపుల్ రోల్ ఇదో రికార్డు!



విశ్వనటుడు కమల్ హాసన్ మాత్రమే దశావతారం ఎత్తారు. ఆ సినిమాలో ఏకంగా పది పాత్రలు పోషించిన ఏకైక ఇండియన్ లెజెండరీగా చరిత్ర సృష్టించారు. అలాంటి నటుడుకి ద్విపాత్రా భినయం... త్రిపాత్రాభినయాలు అన్నది చాలా చిన్న విషయం. అటుపై చియాన్ విక్రమ్ రకరకాల పాత్రలు పోషించారు. వివిధ గెటప్స్‌లో ప్రేక్షకులను అలరించారు. నటులుగా దేశంలోనే ఇద్దరు ఎంతో ప్రత్యేకమైన వాళ్లు. కమల్ హాసన్ తర్వాత స్థానం ఎవరిది అంటే విక్రమ్ మాత్రమే అర్హుడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అతడి ప్రతిభ పాత్రలు మాత్రమే ఆ స్థానాన్ని కట్టబెట్టాయి. టాలీవుడ్ లోనూ చాలా మంది నటులు డ్యూయెల్ రోల్ పోషించారు. అయితే నేటి జనరేషన్ హీరోలు త్రిపాత్రాభినయం ఎవరూ చేయలేదు. రామ్ చరణ్, మహేష్, ప్రభాస్, ఎన్టీఆర్ ఇలా చాలా మంది స్టార్లు ఉన్నారు. కానీ ఎవరూ ఇంతవరకూ మూడు పాత్రలు పోషించలేదు. అయితే ఇప్పుడా సాహసం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చేస్తున్నాడు. బన్నీ 22వ చిత్రం అట్లీ తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. గ్లోబల్ రేంజ్‌లో ఈ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నాడు. ఈ సినిమా నిర్మాణం కోసం సన్ పిక్చర్స్ వందల కోట్లు ఖర్చు చేస్తుంది. ప్రీ ప్రొడక్షన్ పనులకే కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. ఎక్కడా రాజీ పడకుండా ముందుకెళ్తుంది.

అయితే ఈసినిమా స్టోరీ బన్నీని త్రిపాత్రాభిన యానికి డిమాండ్ చేస్తుందిట. ఇప్పటి వరకూ ద్విపాత్రాభిన యం అంటూ ప్రచారం సాగింది. కానీ రెండు కాదు మూడు పాత్రలు పోషిస్తున్నాడు? అన్నది కొత్త అంశం. ఇదే నిజమైతే ఇది రికార్డు అవుతుంది. ఇంతవరకూ ఏ హీరో మూడు పాత్రలు పోషించే సాహసం చేయలేదు. ఏ డైరెక్టర్ కూడా ఆ ఛాన్స్ తీసుకోలేదు. ఒకటి లేదా రెండు పాత్రతోనే హీరో పాత్రలను చుట్టేసేవారు. కానీ అట్లీ మాత్రం బన్నీతో మూడు పాత్రలు వేయించి మరో విశ్వనటుడిని తయారు చేస్తున్నాడు. దీనికి సంబంధించి న్యూయార్క్ ఫిల్మ్ స్టూడియోస్‌లో టెస్ట్ షూట్ కూడా పూర్తి చేసినట్లు సమాచారం.

# అదేంటి.. జక్కన్నకు ఆయన కూడా నో చెప్పారా?




దర్శకధీరుడు రాజమౌళి బ్లాక్ బస్టర్ హిట్ ఆర్‌ఆర్‌ఆర్ మూవీ తర్వాత ఇప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబుతో వర్క్ చేస్తున్న విషయం తెలిసిందే. ఫారెస్ట్ అడ్వెంచర్ డ్రామాగా రూపొందుతున్న SSMB 29 షూటింగ్ ఇప్పుడు శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే హైదరాబాద్, ఒడిశా షెడ్యూల్స్ ను మేకర్స్ కంప్లీట్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు మరో షెడ్యూల్ ను స్టార్ట్ చేసినట్లు సమాచారం. మొత్తానికి మూవీకి సంబంధించి జక్కన్న ఎలాంటి అప్డేట్ ఇవ్వకుండా సైలెంట్‌గా షూటింగ్‌ను నిర్వహిస్తున్నారు. కానీ సోషల్ మీడియాలో మాత్రం ప్రాజెక్ట్‌కు సంబంధించి రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా క్యాస్టింగ్ కోసం ఎప్పటికప్పుడు వైరల్ అవుతున్నాయి. సినిమాలో మహేష్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా నటిస్తున్నట్లు ఇప్పటికే క్లారిటీ ఉంది. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారని సమాచారం. అంతకు మించి ఒక్కరి కోసం కూడా తెలియదు. రీసెంట్‌గా బాలీవుడ్ నటుడు నానా పటేకర్ ను మేకర్స్ సంప్రదించగా.. ఆయన నటించేందుకు నో చెప్పారని టాక్ వినిపించింది. రాజమౌళి సినిమాకు నో చెప్పినంత కారణమేంటోనని అంతా మాట్లాడుకున్నారు. ఇప్పుడు కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ కూడా రిజెక్ట్ చేసినట్లు తెలుస్తోంది. సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం ఆయనకు సెలెక్ట్ చేయగా తిరస్కరించారని సమాచారం. విలన్ రోల్ కాబట్టి చేయనని నిర్ణయించుకోవడంతో విక్రమ్ నో చెప్పారట. విక్రమ్ రిజెక్ట్ చేసిన రోల్‌నే పృథ్వీరాజ్ సుకుమారన్ చేస్తున్నారని కొందరు అంటుండగా.. ఆర్. మాధవన్ నటించనున్నారని మరికొందరు చెబుతున్నారు. మరికొద్ది రోజుల్లో ఆయన సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నట్లు ప్రచారం సాగుతోంది. మొత్తానికి మహేష్‌కు ఆపోజిట్‌గా విలన్ రోల్‌లో పృథ్వీరాజ్ లేదా మాధవన్ కనిపించనున్నారన్నమాట. ఇక సినిమా విషయానికొస్తే.. ప్రపంచాన్ని చుట్టేసే ఓ సాహసికుడి కథగా రూపొందుతున్న మూవీల మహేష్ నెవ్వర్ బిఫోర్ లుక్‌లో కనిపించనున్నారు. అందుకోసం ఆయన ఎప్పటి నుంచో మేకోవర్ అవుతున్నారు. ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎం ఎం కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారు. సుమారు రూ.1000 కోట్ల బడ్జెట్‌తో దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారని వినికిడి. 2026 లేదా 2027లో సినిమా రిలీజ్ అవ్వనుందని టాక్.

# 80% రాయితీపై సంఘ సభ్యులకు పంపిణీ



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** సోమవారం రాంబిల్లి మండలం ధనదిబ్బలు బౌద్ధారామం వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమం వద్ద వ్యవసాయ శాఖ ఏర్పాటుచేసిన స్టాల్‌ను అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ కుమార్ సందర్శించారు. ఈ సంధర్భంగా వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రాంబిల్లి మండలం మురకాడ పంచాయతీ మురకాడ గ్రామానికి చెందిన శ్రీ రామాంజనేయ రైతుమిత్ర సి.హెచ్.సి. సంఘానికి 9.80 లక్షలు విలువ చేసే వ్యవసాయ డ్రోన్‌ను 80% రాయితీపై సంఘ సభ్యులకు పంపిణీ చేసారు.

# ఎంపీకి వినతి పత్రం అందజేసిన శ్రీకాళహస్తి దేవస్థానం ఉచిత సేవకులు




**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి ఎంపీ కార్యాలయంలో శ్రీకాళహస్తి దేవస్థానం ఉచిత సేవకులు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తికి సోమవారం వినతి పత్రం అందజేశారు. 2014 నుంచి మేము శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం నందు జరిగే శ్రీ స్వామి -అమ్మవార్ల ఉత్తవర్ల ఊరేగింపులు, గొడుగులు, దివిటీలు, సూరిటీలను మోస్తూ సేవ చేయడం జరిగింది. గత ప్రభుత్వంలో ట్రస్టుబోర్డు చైర్మెన్ అంజూరు శ్రీనివాసులుని వారి సభ్యులను కలసి విన్నవించుకుని జీతభత్యాలు ఏర్పాటుచేయమని కోరగా అందుకు సమ్మతించి ట్రస్టుబోర్డు సమావేశంలో మా అంశాన్ని పొందుపరచి సభ్యులందరి ఏకగ్రీవ తీర్మానంలో జీతభత్యాలు ఇచ్చేందుకు దేవాదాయ శాఖ కమీషనర్ అనుమతికి పంపడం జరిగింది. కమీషనర్ అనుమతి ఇవ్వడం, జీతభత్యాలు దక్షిణామూర్తి ఏజెన్సీ ద్వారా యిచ్చేందుకు అనుమతి యివ్వడం జరిగింది. ఈ విధంగా ఎన్నో సంవత్సరాలు ఉచితంగా పనిచేసిన మాకు జీతాలు వస్తే, ఇప్పుడు మా ఆర్డర్ అనుమతి కాపీ ద్వారా మా పేర్లు కాకుండా కొత్తవారిని చేర్చి అన్యాయంగా మమ్మల్ని ప్రక్కన పెట్టేస్తుంటే మేమందరం కలసి కోర్టును ఆశ్రయించడం జరిగింది. కోర్టువారు దేవస్థానం అధికారులను కోర్టుకు పిలిపించగా కార్యనిర్వహణాధికారి వారు ఖచ్చితంగా వీరికి జీతాలు యిస్తామని నమ్మపలికారు. కానీ కోర్టును, న్యాయాధికారుల మాటలను భేఖాతరు చేస్తూ, క్రొత్తవారికి డ్యూటీలు ఇస్తున్నారు. కావున మీరు మాకు సంపూర్ణ సహకారం అందించి మా పోరాటానికి సంఘీభావం పలికి నిరుపేదలమయిన మాకు మా ఉద్యోగాలను కాపాడడంలో మాకు అండగా ఉండాలని ఎంపీ గురుమూర్తిని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మీకు న్యాయం చేస్తామని తెలియజేశారు.

# రైతు భారతిలో 10వ తేదీన బాలకృష్ణ జన్మదిన వేడుకలు : పొలిమేర నాయుడు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ప్రముఖ చలనచిత్రం నటులు హిందూపూర్ శాసనసభ్యులు పద్మ విభూషణ అవార్డు గ్రహీత నందమూరి బాలకృష్ణ ఈనెల 10వ తేదీన వివి రమణ రైతు భారతిలో ఘనంగా నిర్వహించడానికి పట్టణ బాలకృష్ణ ఫ్యాన్స్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని బాలకృష్ణ ఫ్యాన్స్ గౌరవాధ్యక్షులు హెూలీ వీరు నాయుడు తెలియజేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావును ఘనంగా సన్మానిస్తామని, ఈ కార్యక్రమానికి గౌరవ అతిధులుగా శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ మాజీ మంత్రివర్యులు దాడి వీరభద్రరావు అర్బన్ ఫైనాన్స్ మౌలిక సదుపాయాలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ రాష్ట్ర సీనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు కర్రి దివాకరరావు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ బాలకృష్ణ ఫ్యాన్స్ పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నాము.

# విజన్ స్వర్ణ ఆంధ్ర 2047 ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు : ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ






**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** స్వర్ణ ఆంధ్రా 2047లో భాగంగా రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయు డుచే వర్చువల్‌గా విజయవాడ నుండి సూళ్లూరుపేట నియో జకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయం నందు సూళ్లూరు పేట నియోజకవర్గం శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి ఇ కిరణ్మయి పాల్గొనారు. రాష్ట్రం గత ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా సంక్షో భంలోకి వెళ్లిందని, రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకుంటూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ 6 పథకాలను ఒక్కొక్కటి అమలు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలియజేశారు. రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని సమస్యలు తీరిపోలేదని, రాష్ట్ర ప్రజలకు నమ్మకం భరోసా ఇచ్చామని, కేంద్ర ప్రభుత్వం సహకారంతో విశాఖపట్నంలో రైల్వే జోన్,పోర్ట్ తీసుకొస్తున్నామని, రాష్ట్రంలో ఒకపక్క సంక్షేమ మరోపక్క అభివృద్ధి జరగాలని తెలి పారు. గత ప్రభుత్వ హయాంలో 12% ఉన్న గ్రోత్ రేట్‌ని మన ప్రభుత్వ హయాంలో అందరం కలిసికట్టుగా పనిచేసి 15% తీసుకు రావాలని తెలిపారు.


గత ప్రభుత్వ హయాంలో జల్ జీవన్ మిషన్‌కి పూర్తిగా నిధులు ఖర్చు పెట్టలేదని, ప్రస్తుతం జల్ జీవన్ మిషన్ నిధులు సమృద్ధిగా ఉన్నాయని రాష్ట్రంలో ఎక్కడ నీటి కొరత ఉండ కూడదని తెలియజేశారు. మంచి చేసే ప్రయత్నంలో రాష్ట్రం బాగు పడాలని తెలియజేశారు. పై కార్యక్రమంలో ఆరు మండలాల తహ సిల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలు వ్యక్తిగత, సామాజిక అంశాలపై అర్జీలు అందజేత









| SNO | DEPARTMENT/HOD | RECEIVED |
|---|---|---|
| 1 | Revenue (CCLA) | 122 |
| 2 | Panchayati Raj | 32 |
| 3 | Survey Settlements and Land Records | 18 |
| 4 | Police | 17 |
| 5 | Rural Development | 9 |
| 6 | Municipal Administration | 8 |
| 7 | Civil Supplies | 7 |
| 8 | AP Eastern Power Distribution Co Ltd (EPDCL) | 7 |
| 9 | Agriculture | 3 |
| 10 | Mines And Geology | 3 |
| 11 | Roads and Buildings (E-in-C) | 2 |
| 12 | AP Social Welfare Residential Educational Institutions Society (APSWREIS) | 1 |
| 13 | AP Scheduled Castes Cooperative Finance Corporation (APSCCFC) | 1 |
| 14 | Rural Water Supply Engineering | 1 |
| 15 | AP Dairy Development Cooperative Federation (AP DIARY) | 1 |
| 16 | Society For Elimination Of Rural Poverty | 1 |
| 17 | Labour | 1 |
| 18 | AP State Skill Development Corporation | 1 |
| 19 | Cooperation And Cooperative Societies | 1 |
| 20 | Forest (PCCF) | 1 |
| 21 | Directorate of Secondary Health | 1 |
| 22 | School Education | 1 |
| 23 | AP State Housing Corporation Ltd | 1 |
| | | 240 |

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు వ్యక్తిగత, సామాజిక అంశాలపై అర్జీలు అందజేసారు.

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్య నారాయణరావు, ఎస్.డి.సి.లు సుబ్బలక్ష్మి, కె.మనోరమ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుల సత్వర పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు సూచనలు ఆదేశాలు జారీ చేసారు. ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో 240 అర్జీలను ప్రజలు అందజేసారు. వాటిలో రెవిన్యూ శాఖకు సంబంధించి 122, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 32, సర్వే శాఖకు 18, పోలీసు శాఖకు 17, గ్రామీణాభివృద్ధి శాఖకు 9, మునిసిపల్ శాఖకు 8, సివిల్ సప్లయి 7, విద్యుత్ శాఖకు 7, ఇతర శాఖలకు సంబంధించి 20 అర్జీలను అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# యెన్నేటి నారాయణ రావు కుటుంబాన్ని పరామర్శించిన యూట్యూబర్ హర్షసాయి





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అనకాపల్లి సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ ఐ లవ్ అనకాపల్లి పేజీ క్రియేటర్ యెన్నేటి నారాయణ రావు కుటుంబాన్ని యూట్యూబర్ హర్ష సాయి పరామర్శించారు. అనకాపల్లి దాసరి గెడ్డ రోడ్డు, పల్లపు వీధి బంగ్లాకు చెందిన నారాయణ రావు సోషల్ మీడియాలో ఐ లవ్ అనకాపల్లి పేజితో అనకాపల్లి జిల్లా విశేషాలు, ప్రత్యేకతలు, పండగలు పోస్టులు చేస్తూ తక్కువ సమయంలోనే 1,50,000 మంది ఫాలోవర్లుతో ఎక్కువ మంది అభిమానం సంపాదించుకున్నారు అని, ఇంత చిన్న వయసులోనే రోడ్డు ప్రమాదంలో మరణించడం దురదృష్టకరమని ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిన్న ఆదివారం హర్ష సాయి అనకాపల్లి విచ్చేసి నారాయణరావు కుటుంబాన్ని పరామర్శించి నారాయణరావు కుటుంబానికి తక్షణ సాయంగా ఒక లక్ష యాభైవేల రూపాయలు అందించారు. భవిష్యత్తులో నారాయణరావు కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

అలాగే అన్ని జిల్లాల్లో గల నారాయణరావు సోషల్ మీడియా ఫాలోవర్లు, అభిమానులు, నిధులు సమీకరించి మరో రెండు లక్షల రూపాయలు అతని కుటుంబానికి అందించనున్నట్లు తెలిపారు.

# మత మార్పిడి చేసుకొని దళితుల హక్కులను కబ్జా చేస్తున్న క్రైస్తవులు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** మత మార్పిడి చేసుకొని దళితుల హక్కులను క్రైస్తవులు కబ్జా చేస్తున్నారని హిందూ షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బోని గణేష్ పేర్కొన్నారు పట్టణంలో స్థానిక పూల్ బాగ్ రోడ్డులో ఉన్న కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడెక్కడ నుండో పాస్టర్లుగా దళితవాడలకు వచ్చి హిందువులను మతమార్పిడి చేసి క్రైస్తవులుగా మార్చి ఏటువంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా దళితవాడల్లో చర్చిలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. నేడు కొంతమంది పాస్టర్లు ప్రార్థనల పేరుతో దళిత మహిళలను మైనర్ బాలికల పట్ల వేధింపులు మానభంగాలకు తెగబడుతున్నారని, అంతేకాకుండా దేవుడు పేరుతో దళితుల మధ్య మతపరమైన విద్వేషాలను నూరు పోసి దళిత వర్గాల మధ్య గొడవలు పెడుతున్నారని పేర్కొన్నారు. 75 సంవత్సరాల ఈ నవ భారత రాజ్యాంగ చరిత్రలో నిజమైన హిందువులుగా జీవిస్తున్న దళితులు విద్యని, ఉపాధిని, ఉద్యోగాలను, రాజ్యాధికారం కోల్పోయి నేటికీ నిరుపేదలగానే జీవిస్తున్నారని, గౌరవ న్యాయస్థానాలు దళితుల నుండి క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే వారికి ఎస్సీ హెూదా కోల్పోతారని ఇచ్చిన తీర్పులు పట్టించుకోకుండా నేడు ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. వర్గీకరణ పేరుతో ఆంధ్రప్రదేశ్లో కులగణన చేపట్టిన ప్రభుత్వం, క్రైస్తవులను గుర్తించలేదని, మతమార్పిడి చేసుకొని కూడా హిందువులు గానే కుల ధ్రువీకరణ పత్రాలు పొందుతూ ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నేడు వర్గీకరణ కంటే క్రూరమైనది మతమార్పిడి అని దీనిపై చర్యలు తీసుకుంటే పూర్తి స్థాయిలో ఎస్సీల్లో ఉన్న 59 కులాలకు రిజర్వేషన్ లభిస్తుందని అన్నారు నేటికైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి రాష్ట్రంలో దళితుల నుండి క్రైస్తవ మతం స్వీకరించిన వారిని గుర్తించి వారిని బీసీ – సీ పరిగణించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మైలపల్లి పోతురాజు, అంగులూరి ఈశ్వరరావు, గంగాధర్ మరియమ్మ, గెంజి రమణ, గిలకల భాస్కరరావు, ఓడల సంజీవరావు, సత్యాడ కాళీ, కోనపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan